# చున్ని

## మనోప్రియ



ఇంట్లోంచి హోండా బయటకు తీసి అమ్మతో అంది పద్మ "ఆఫీసునుండి సుల్తాన్ బజారు వెళ్లివస్తాను. ఆలస్యం అవుతుంది".

అమ్మ వీధి తలుపులు వేయబోతూ, "కొత్త చున్నీలొచ్చాయా?" అడిగింది.

నవ్వి, "పండగరోజులు కదా వచ్చి ఉంటాయి" అంది.

"ఎన్నో ఉండగా కొత్తవి ఎందుకే కొనడం?"

"వెరయిటీవి ఏమయినా వచ్చాయేమో చూస్తాను. బావుంటేనే కొంటాను" బండి స్టార్టు చేసింది.

"నీ ఇష్టం" అంది అమ్మ. అమ్మ తన మాట కాదనదు. మిగతా విషయాల్లో తను అనవసరంగా డబ్బు ఖర్చు చేయదని తెలుసు. బండి రోడ్డు మీదకు వచ్చింది. ఇప్పటికే రెండు వందలకు పయిగా చున్నీలున్నాయి. అవి ఏ డ్రస్‌లకన్నా సరిపోతాయి. అంత ఖరీదయినవేమీ కాదు. చూడడానికి చాలా బావుంటాయి.

ఇంటి దగ్గర నుండి ఆఫీసుకు నలభయి నిమిషాల ప్రయాణం. ట్రాఫిక్ జాంలో పడితే గంట దాటుతుంది. అప్పుడప్పుడే రోడ్డు రద్దీ అందుకుంటోంది. ఎండాకాలం మొదలు కాలేదు కాని ఉక్కపోస్తోంది. హుక్‌కు హెల్మెట్ ఉంది కాని వేసుకోలేదు. చున్నీలు కొనడం అలవాటు చేసింది అరుణ. అందుకే తనకు సుల్తాన్ బజారు గుర్తు రాగానే అరుణ గుర్తు వస్తుంది. కొట్లలో ఓపికగా కూర్చుని మంచి చున్నీలు ఎన్నుకోవడంలో దిట్ట. బేరం కూడా బాగా ఆడుతుంది.

అరుణ తనకంటే పది సంవత్సరాలు పెద్దది. మనిషి బాగానే ఉంటుంది. ఆమె, తను కలిసి ఆరు నెలలపాటు ఎస్.ఎ.పి. చేశారు. సంవత్సరంన్నర నుండి పరిచయం. పెళ్లి కాలేదు. స్వతహాగా మనిషి

**సింగిల్ పేజి కథ**

మంచిదే. ఒకప్పుడు తరుచుగా ఇంటికి వస్తుండేది. యం.బి.ఎ. కూడా పూర్తి చేసింది. అమె దురదృష్టం ఏమిటో సంబంధాలు ఇంటివరకు వచ్చి వెనక్కి వెళ్లిపోతుంటాయి. ఉద్యోగాలు కూడా నాలుగయిదు చోట్ల కుదురుగా చేయలేదు. రెండు మూడుసార్లు ఎందుకని తను అడిగితే అరుణ నుండి సరయిన జవాబు రాలేదు. అప్పుడప్పుడు ఆమె జవాబులు అర్థం అయీ, అర్థం కానట్టు ఉండేవి. చాలా తక్కువసార్లు మటుకు విషాదంగా ఉండేవి. చాలా మాటలు దాస్తున్నట్టుగా అనిపిస్తుంటుంది. అంచాత అరుణ స్వవిషయాలు తెలుసుకుందామని పద్మకు ఎప్పుడూ అనిపించలేదు. ఒకసారి మాటల్లో 'నాకు మీలాంటి అమ్మా నాన్న ఉండుంటే నా పెళ్లి ఎప్పుడో అయి ఉండేది'. అరుణ అనేసరికి పద్మకు జాలి వేసి తన తల్లికి చెప్పింది. పద్మ తల్లి అటు తిరిగి, ఇటు తిరిగి దాదాపు పది సంబంధాల వరకు చూసిపెట్టింది. ఏదీ నిశ్చయం కాలేదు. కథ మళ్లీ మొదటికొచ్చింది.

మూడు వారాల తర్వాత తల్లి పద్మతో అంది, "అరుణతో స్నేహం తగ్గించుకో". ఆశ్చర్యపోతూ తల్లి ముఖంలోకి చూస్తూ, "ఏమయింది?" అడిగింది పద్మ.

మనవాళ్ల అమ్మాయి కదా అని ఓపికగా ఇన్ని సంబంధాలు తెచ్చి దాదాపు సంవత్సరం వృధా చేశాను. వచ్చిన సంబంధాలకు ఏదో వంక పెడుతూ అరుణే తిప్పికొడుతూ ఉందట. ఎందుచేత అని ఆరా తీస్తే అరుణకు రఘురాం అనే స్నేహితుడున్నాడట. అతను అరుణకన్నా నాలుగయిదు సంవత్సరాలు చిన్న. వాళ్లది పరిచయం అంటారో, సంబంధం అంటారో, ఏమో, మూడు నాలుగు సంవత్సరాల నుండి నడుస్తోందట. గమ్మత్తయిన విషయం ఏమిటంటే అతనికి రెండు సంవత్సరాల కిందటే పెళ్లి అయింది. ఒక బాబు అట. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట్లు ఆవయసులో జరగకపోతే ఇదో ఇటువంటి ప్రమాదాలే జరుగుతాయి..."

తల్లి చెప్పిన మాటలకు పద్మకు అరుణ మీద జాలి వేసింది. పెళ్లి అయిన వ్యక్తితో సంబంధం పెట్టుకుందంటే పెళ్లి మీద ఆసక్తి పోయి ఉండాలి. లేదూ, ఇంట్లోవాళ్లు తన పెళ్లి గురించి పట్టించుకోవడం మానేసయినా ఉండాలి.

అరుణ ఎస్.ఎ.పి. థియరీ క్లాసులు పూర్తి చేసింది కాని ప్రాక్టికల్స్ మీద ఎటువంటి ఆసక్తి చూపించేది కాదు. ఉదయాన్నే క్లాసుకు వచ్చినా క్లాసు అయిపోయే వరకు ఉండేది కాదు. బయటకు వెళ్లి లాన్‌లో కూర్చుని చాలా సేపటి వరకు సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతుండేది. బేచ్‌మేట్స్ అరుణ అంతసేపు మాట్లాడడం చూసి విసుక్కునేవాళ్లు. ఒకసారి మాటల్లో అరుణ పద్మతో అంది, "మా కజిన్ శేఖర్ అని బెంగుళూరులో ఉద్యోగం చేస్తుంటాడు. గంటకు ఒకసారయినా నాతో మాట్లాడకుండా ఉండలేదు".

"అంతసేపు మాట్లాడుతుంటే డబ్బులు ఎక్కువకావా?" అడిగింది పద్మ.

"సెల్ నుండి సెల్‌కు ఎంతసేపయినా మాట్లాడుకోవచ్చు".

"మీ ఇద్దరి సెల్స్‌కు ఒకటే ఎకౌంటు నెంబరా?"

అరుణ జవాబు చెప్పలేదు. తను చెప్పేది నిజం కానప్పుడు మాట దాటేస్తుంది. మొదట్లో అరుణ మాటలు నమ్మేది కాని శేఖర్ అసలుపేరు రఘురాం అని అతను ఉండేది బెంగుళూరులో కాదని, బిలాస్‌పూర్‌లో అని అప్పుడప్పుడు హైదరాబాద్ వచ్చేవాడని ఈ మధ్యనే హైదరాబాద్‌కు బదిలీ అయిందని తెలుసుకుంది. అరుణ స్వవిషయాల్లోనే కాకుండా చిన్న చిన్న విషయాల్లో కూడా తడుముకోకుండా అబద్ధాలు చెబుతుంటే స్నేహం తెంపుకోలేదు కాని దూరంగా ఉండడం మొదలెట్టింది. ఫోనులో మాట్లాడడం తగ్గిపోయింది. ఆమెను చూసే ఆరు నెలల దాటింది.

పంజాగుట్ట దాటి మెహిదీపట్నం వయిపు దారి మళ్లించాక పద్మకు అరుణ కనిపించింది. అరుణ ఎవరి మోటరు బయిక్‌లోనో వెనక కూర్చుని ఉంది. బండి నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ పెట్టుకుని ఉన్నాడు. అతను అరుణ అన్నయ్యో, తమ్ముడో అయి ఉండడు. అరుణ అతనికి అతుక్కుని కూర్చుంది. ఆమె చేతులు అతని నడుంచుట్టూ ఉన్నాయి. వాళ్ల బండి తన బండికి ఆరేడడుగుల దూరంలో ఉంది. వేగం పెంచి అతన్ని చూద్దామని అనిపించినా హెల్మెట్ ఉండటాన అతని ముఖం కనబడదు. అరుణ తల అతని బుజంమీద వాల్చి అదో తన్మయత్వంలో ఉంది. సిటీలో ఇటువంటి దృశ్యాలు అతి సామాన్యమయినవే. ఎవరూ పట్టించుకోరు. అరుణకు పెళ్లి అయిందేమోనని పాదాలవంక చూసింది పద్మ. కాలికి బంగారపు రంగు కాలి పట్టా ఉంది. కాలి వేలికి మట్టెలు లేవు. అంటే అరుణకు పెళ్లి కాలేదన్న మాట. బండి నడుపుతున్న వ్యక్తి ఆమె భర్త కాడు. రఘు కావచ్చు. జగదీశ్ కావచ్చు. సురేష్ కావచ్చు. మనోహర్ రాజు కావచ్చు. ఆమెకిష్టమయిన ఎవరయినా కావచ్చు. జీవితం ఆమెది. స్వాతంత్ర్యం ఉంది. ఎవరయినా చూస్తారనే భయం లేదు. అది తనకు ఎటువంటి సంబంధం లేని విషయం.

పద్మ ఆలోచనలు అక్కడితో ఆగిపోయాయి. అరుణ వేసుకున్న చున్ని సగం గచ్చకాయరంగులో సగం బిస్కెట్ రంగులోఉంది. చాలా బావుంది. ఎక్కడ కొన్నదో ఏమో! ఒక అంచు మెడకు చుట్టుకుని ఉంది. రెండో అంచు కింద జీరాడుతోంది. అది ఏ క్షణంలో అయినా వెనక చక్రానికి చుట్టుకుపోవచ్చు. చుట్టుకుపోతే ప్రాణం పోయే ముప్పు కలుగుతుంది. పద్మకు ఏం చేయాలో తోచడం లేదు. బండి వేగం పెంచి "అరుణా, అరుణా" అని అరిచింది. అరుణ తల వెనక్కి తిప్ప పద్మను చూసింది. "నీ చున్ని... చున్ని" పద్మ మాటలు అరుణకు వినిపించాయో, లేదో తెలియదు కాని ఎదురుగా వచ్చిన సిటీ బస్సును పద్మ గమనించలేదు. డ్రయివరు బ్రేక్ వేసేసరికి అంతా అయిపోయింది. పద్మ చున్నీ మటుకు ఎగిరి రోడ్డు పక్కనున్న పూలమొక్క మీద పడింది. దానికి బొట్టంత రక్తం అయినా అంటలేదు.